మనుకో। కానీ వాళ్ళుమాత్రం మన మాట వింటారా ?"

హెడ్మాస్టరుగారు స్వగృహంలో సుగ్రీవుడు. బడిలో చండ శాసనుడు. పోగా. ఊళ్ళో ప్రయోజకత్వం వెలగ పెడుతున్న పిన్న పెద్దల్లో సగంమందికి పైగా ఆయన శిష్యులు. కానీ. తుపాను పట్టుకున్న రాత్రి విద్యుద్దీపాలను గురించి భయపడినట్టుగా ఆయన కెప్పటికప్పుడు తనమాట ఎవరూ వినరేమోనని ఓ అపనమ్మకం.

"ఐనా యిలా వూళ్ళమీదపడి దోచు కోడానికి వీళ్ళ కెవడిచ్చాడయ్యా అధి కారం? ఎలా జరుగుతుందో చూస్తాను! వీళ్ళిక్కడ పడి విలవిల తన్నుకున్నా సరే, మన ఆటస్థలంలో దేరా వేయడా నికి ఒప్పుకోను. రేపీపాటికి వీళ్లిక్కడి నుంచీ బిచాణా ఎత్తేయకపోతే నాకు మారు పేరు పెట్టు...."

ఎలా వచ్చారో అలాగే తటాలున నిష్క్రమించారు హెడ్మాస్టరుగారు. పగబూని కక్ష సాధించినట్టుగా హెడ్మా స్టరుగారు నాటకాలవాళ్ళపైన మండి పడడ మెందుకో నాకర్థంగాలేదు. అర్థమై చావని హాలివుడ్ పటంకోసం రెండుం పావలా ముడుపు చెల్లించి, థీయేటరు నుండి బయట పడగానే తలనొప్పికి తక్షణ నివారణోపాయంక్రింద స్పెషల్ కాఫీ సేవిస్తున్నాడు పట్టణంలో ప్రేక్ష కుడు. ఇక్కడ వీళ్ళేమో మీవి కాళ్లు. మావి చేతులని సభావందనాలుచేసి, ప్రతి వస్సుమోరును మహా ప్రసాదంగా స్వీకరించి చెంగు భిక్షంలాంటి కొద్ది పాటి రాబడికే సిద్ధపడుతుండే— ఊళ్ళ పైనబడి దోచుకుంటున్నారని చెబుతు న్నారు హెడ్మాస్టరుగారు. కడుపు చించు కున్నా గారడీ విద్యేననుకోవడం యిదే కాబోలు!

నా మట్టుకు నాకు నాటకాలవాళ్ళని చూస్తుంటే ఏడుపొస్తోంది. ఎక్కడ తిన్నారో ఏమిటో వాళ్ల పెరికి పారవేసిన తోటకూర కాడల్లా వదిలిపోయి వున్నారు. లేని ఓపరికం తెచ్చుకుని ఆడ వాళ్ళు కొందరు మూడు రాళ్ళపొయ్యి లమరించి సత్తుగిన్నెలు పైకి తీస్తున్నారు. ఓ నడిప్రాయం ఆడమనిషి పదేళ్ళ కుర్రాడి బోడితలపైన నాలుగు వడ్డించి, రెండు కానీలకు ఉప్పు ఓ అణాకు మిరపకాయలూ తీసుకుని లగెత్తు కుని రమ్మంటోంది. పొయ్యికి వాటెడు చొప్పున కట్టెపుల్లలు గూడా దొరికితే నే నిక్కడ కుర్చీలో వుండగానే వాళ్ళ వంట లైపోయే టట్టున్నాయి. వాళ్ళ కూడు వాళ్ళు తింటారు. వాళ్ళబ్రతుకు వాళ్ళు బ్రతుకుతారు. అందు కడ్డుతగ లడం ఏంన్యాయం? నాటకాలవాళ్ళ తరపున హెడ్మాస్టరుగారికి ఈమాట కాస్త గట్టిగా చెప్పాలన్నంత వరకూ నాలో సదుద్దేశం అనలు తొడిగింది. కానీ హెడ్మాస్టరుగారి ధోరణి సుపరిచి

ఖాయమని తెలిసినప్పటికీ ఆఖరు ప్రయత్నం చేస్తున్న వీరభటుడిలా అతడు ముందుకు వచ్చాడు. "దండాలు బాబూ దండాలు" అంటూ జనసమూహానికొకసారి చేతులు జోడించి వెంటనే ద్వారానికడ్డంగా చేతులు చాపేశాడు. "పెద్దలూ చిన్నలూ అందరూ చిత్తగించాలి. కూటికోసం కోటి విద్యలు. అందులో ఒక విద్య మాది. దీన్ని నమ్ముకుని మేమిలా దేశం పైన తిరుగుతున్నాము. మహారాజు లందరూ మా పైన దాష్టీకం చెలాయించాలనుకుంటే మేము బ్రతకలేము. వెళ్ళిన వాళ్లు లోపలికి వెళ్ళారు. ఇకపైన ఒక పిట్టకూననైనా ఉచితంగా లోపలికి వదలడానికి వీల్లేదు..."

ద్వారపాలకుడి విజ్ఞాపనం పూర్తి కానున్నదనగా అతనికి నాలుగు బారల దూరంలో వున్నాడు నాగరాజు.

ఎలా వున్నాడు?

తనలాంటి వాళ్లు యిద్దరు ముగ్గురు సునాయాసంగా మారిపోవడానికి వీలున్న పైజమా వేశాడు. అలాంటిదే పసుపు రంగు సిల్కుజుబ్బా తొడుకున్నాడు. మెడకు రుమాలా చుట్టాడు. లాటీకర్ర చేతబట్టాడు. సిగరెట్టుపొగల వలయాలు బరాబరులు పలుకుతుండగా ధనుర్ముక్తమైన బాణంలా రివ్వున ద్వారం దగ్గరికి వచ్చేశాడు.



"ఏమిటండీ కంగారు పడతారు అనవసరంగా! తల ఐసులావుంటే జ్వరం వస్తూందంటారేం!"
"అదేనండి డాక్టరుగారూ చలిజ్వరంతో బాధ పడుతున్నాను."

వచ్చిన వాడు నాగరాజొక్కడే కాదు. పిరంగిలాంటి రంగడు. చాకులాంటి రజాకు. క్రుద్ధవృకోదరుణ్ణి తలపించే ముద్దుసామి. పందెపు కోడిపుంజు లాంటి ఆంజనేయులు—వీళ్ళేకాదు. నాగరాజును పరివేష్టించి వున్న మిత్రబృందంలో యింకా హేమా హేమీలు పలువురున్నారు.

"దారి వదులు" ఆజ్ఞాపించాడు నాగరాజు.

"వీల్లేదు. ప్రాణం పోయినా సరే దారి వదలను. టికెట్లు కొనుక్కోవాలి. లోపల అడుగు బెట్టాలి" అన్నాడు ద్వారపాలకుడు.

నాగరాజు ముఖంలో ఓ కోపవీచిక విసురుగా పారాడింది. "టిక్కెట్లు! ఎక్కడున్నాయి టికెట్లు? ఓరే రంగడూ అందుకోరా టికెట్లు."

నాగరాజు హుకూం జారిచేసిన మరుక్షణంలో టికెట్ల పుస్తకం రంగడి చేతులో వుంది.

టికెట్లిస్తున్న మనిషి మధ్యఆఫ్రికాలో సిగ్మీలాంటి కుబ్జుడు. ఆ స్వల్పశరీరంలో అపాటి సాహసం దాగి వుంటుందని ఎవ్వరూ వూహించి వుండరు. అతడు తోడేలు పిల్లలా చెంగున రంగడి పైకి లఘించాడు టికెట్ల పుస్తకాన్ని ఒరిసి తన చేతిలోకి లాక్కున్నాడు.

అవమానభారంతో రంగడు అగ్గిపైన గుగ్గిలంలా కస్సుమని పైకిలేచాడు. అవలీలగా కుబ్జుణ్ణి పైకెత్తి నిలువెత్తు నుంచీ చింతపండు మూటలా క్రింద కుదేశాడు. గిరజాలు పట్టుకుని నీళ్ళల్లో ముంచి లేపనెత్తినట్టు అదేపనిగా కుదిపి వేయసాగాడు.

రంగడి చేతులో నజ్జుగుజ్జయి పోతూ కుబ్జుడు పెట్టిన గావుకేకలకు తల్లుల చంకల్లోని పసిబిడ్డలు వులిక్కిపడి కెవ్వున ఏడుపు లంకించు కున్నారు.

సగం సగం వేషాలతో బయటపడిన నాటకాల వాళ్ళకు అక్కడ జరుగుతున్న దేమిటో స్పష్టంగా అవగాహన చేసుకునే వెసులు బాటులేక పోయింది. చిమ్మ చీకటిలో దారి నడుస్తూ భయం లేకుండా వుండటానికని గొంతెత్తి పాడుకునే ఒంటరి పాంధుడిలా వాళ్లు "పట్టు, కొట్టు, తన్ను" అంటూ కంఠశోష పెట్టుకున్నారు

నాగరాజు కళ్లు విస్ఫులింగాల్లా మండుతున్నాయి. తీవ్రమైన కోపానికి చిహ్నంగా అతడి ముక్కుపైన చిరు చెమట పొటమరించింది. ముడిపడిన ఫాలతలంతో, వంకరలు తిరుగుతున్న పెదవులతో అతడొక్కసారి హుమ్మని హుంకరించాడు. నాగరాజు మిత్రులకు అహంకారాన్ని మించిన ఆజ్ఞా పత్రాలనవసరం! వాళ్లు జాడుకరచుకుని పిడికిళ్లు బిగించుకుని ప్రేలుతున్న చిచ్చుబుడ్లకు మల్లే రంగంలోకి దూకేశారు.

"చితకదన్నండి. చావబాదండి. గుంజలు పెరకండి. పరదాలు చించండి. పందిరి పీకండి" అంటూ ఏకధాటిగా నినాదాలిచ్చేస్తున్నాడు నాగరాజు.

ఉరుముల్లాంటి నినాదాలతో బాటుగా గాలివానలాంటి గగ్గోలుకూడా ప్రారంభమైంది. పెళీ పెళీమని చెంప లదిరి పోతున్నాయి. పెళ్లు పెళ్లున గుంజలు విరిగి పోతున్నాయి. పర్రు పర్రున పరదాలు చిరిగి పోతున్నాయి.

ఒకటి...రెండు...మూడు... నిమిషాలు గడిచి పోతున్నాయి. ఎర్రగా పైకిలేస్తున్న ఎండుదుమ్ములో వలయాకృతితో ముందుకు విరగబడుతున్న జనసమూహం మధ్య కొమ్ము ఏనుగుల వంటి పల్లెటూరి వస్తాదుల చేతుల్లో నాటకాల వాళ్ళు చలిమిడిముద్దలైపోతున్నారు. ప్రేక్షకుల్లో ఎవరి ముఖంలోకి చూచినా ఒక్కటే ప్రశ్న! ఏమౌతారు? ఈ నాట

